# ప్యూర్టోరికో : అమెరికా సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటం

**ప్యూర్టోరికో** దీవిలో వలసపాలనను అంత మొందించాలనే పిలుపుతో, గవర్నర్ రికార్డో రొసెల్లో రాజీనామాను కోరుతూ ప్రజలంతా ఈ సంవత్సరం జులై నెల మధ్యభాగంలో పెద్దఎత్తున కదిలారు. క్రూర పోలీసు నిర్బంధాన్ని ఎదుర్కొంటూ గవర్నర్ భవనం చుట్టూ రోజుల తరబడి గుమికూడారు. గవర్నర్‌తో జరిగిన ఒక గ్రూపు చర్చలలోని విషయాలను బయటకు వెల్లడించారనే ఆరోపణలతో, అవినీతి ఆరోపణలతో మాజీ అధికారులతో సహా ఆరుగురిని ఎఫ్‌బిఐ అరెస్టు చేసిన దానికి ప్రతి స్పందనగా ఈ ప్రజాకదలిక వచ్చింది. 15 మిలియన్ డాలర్ల విలువచేసే విద్య, వైద్య నిధులను దుర్వినియోగం చేశారనేది అవినీతి ఆరోపణల్లో ఒకటి. గ్రూపు సంభాషణల్లో గవర్నర్ రొసెల్లో ప్రతిపక్షాలను అవహేళన చేస్తూ మాట్లాడాడు. ఇంకా ప్రచండ తుఫాను మారియా ధాటికి 4,645 మంది ప్రజలు చనిపోవడంపై జోకులు వేశాడు.

ఈ రెండు సంఘటనలు ప్రజలలో ఆగ్రహాన్ని రగిల్చి ప్రతిఘటనలకు కారణమైనాయి. తుఫాను బీభత్సం తర్వాత రెండు సంవత్సరాల నుండి వారనుభవిస్తున్న ఇబ్బందుల నుండి పుట్టిన కోపానికి వ్యక్తీకరణలు ఈ నిరసనలు. తుఫాను వల్ల జరిగిన నష్టాన్నుండి కోలుకునే చర్యలు చేపట్టటాన్ని అమెరికా సామ్రాజ్యవాదం కావాలనే ఆలశ్యం చేసింది. వారాలతరబడి సరఫరాలను నిలిపివేసింది. ఆరోగ్య, భద్రతా వ్యవస్థలను మొత్తం తన అధీనంలోకి తెచ్చుకుంది. మొత్తంగా పునరుద్ధరణ క్రమాన్ని మందకొడిగా చేసింది.

జులైలో వచ్చిన ప్రజానిరసనలకు ఇవి తక్షణ కారణాలు. అమెరికా ఆధిపత్యం ఒక తీవ్రమైన సమస్యగా వారిలో ఎప్పటినుండో రగులుతోంది. తుఫాను తాకిడికి ఒక్క సంవత్సరం ముందు ఆగస్టు 31, 2016న అమెరికా కాంగ్రెసు ప్యూర్టోరికో పర్యవేక్షణ, నిర్వహణ, ఆర్థిక స్థిరత్వ చట్టాన్ని ఆమోదించింది. ప్యూర్టోరికో రుణసంక్షోభాన్ని ఎదుర్కోవటానికి ఆర్థిక నియంత్రణ వ్యవస్థను ఏర్పాటు చేసే అధికారాన్ని అమెరికా ప్రభుత్వానికి ఈ చట్టం కల్పిస్తుంది.

రుణసంక్షోభం పేరిట తీసుకున్న చర్యలు ప్రజలను ఇబ్బందుల పాలుచేసే విధంగా వుంటూండగా, అవి మారియా తుఫాను తర్వాత మరింత దుర్భరంగా మారాయి. రిటైరైన ఉద్యోగులకు పెన్షన్లు నిలిపివేశారు. ప్రభుత్వ యూనివర్శిటీలో ట్యూషన్ ఫీజులు మూడురెట్లు పెరిగాయి. కార్మికుల హక్కులను హరించివేసే విధంగా కార్మిక చట్టాలలో మార్పులు చేశారు. ప్రభుత్వరంగ సంస్థలు ప్రైవేటీకరణ దిశగా అమ్మకానికి పెట్టారు. గనుల తవ్వకాలను ప్రోత్సహించటానికి పర్యావరణ నిబంధనలన్నీ సడలించారు. వందలాది స్కూళ్ళను మూతవేశారు.

అమెరికా పౌరురాలు, రిపబ్లికన్ పార్టీకి చెందిన జూలియా కెప్లర్ నేటి పాలనా వ్యవస్థలో విద్యాశాఖ కార్యదర్శిగా 2 లక్షల యాభైవేల డాలర్ల జీతంతో నియమితులయ్యారు. ఆమె 442 స్కూళ్ళను మూసివేయించింది. ప్యూర్టోరికోలో ప్రభుత్వ విద్య స్థానంలో ప్రైవేటు విద్య ప్రవేశానికి అనుమతించింది. ప్రస్తుతం ఆమె అవినీతి ఆరోపణలపై అరెస్టు అయింది. మరొక అమెరికా పౌరురాలు ఎవీలా – మరీరో ప్యూర్టోరికో ఆరోగ్యబీమా పరిపాలనా విభాగపు అధిపతి. అత్యంత వినాశకర తుఫాను తాకిడి గురైన దేశంలో ఆరోగ్యానికి కేటాయించవలసిన నిధులలో కోతను విధించింది. ఆమె కూడా అవినీతి ఆరోపణలపై అరెస్టు అయింది. వీళ్ళేకాక ఇతర అధికారులు, గవర్నరు కూడా ప్రభుత్వ నిధులను తమ వ్యక్తిగత లబ్ధికోసం ఉపయోగించుకుంటూ మరోవైపు ప్రజలను అంతులేని కష్టాలకు, బాధలకు గురిచేస్తున్నారు.

లాటిన్ అమెరికాలో ప్రజాఉద్యమాలపై రచనలు చేస్తున్న సీనియర్ జర్నలిస్టు అయిన జాక్లిన్ వెలాక్వెజ్ రోడ్రిగ్ ఈ పరిస్థితిని ఈవిధంగా పేర్కొన్నాడు. "ప్రజాధనాన్ని అడ్డగోలుగా దోచుకోవటాన్ని మనం దశాబ్దాల తరబడి చూస్తున్నాం. అధికారుల, సలహాదారుల, స్నేహితుల, కుటుంబ సభ్యుల అరెస్టులు అమెరికా ప్రభుత్వం ఆడిస్తున్న నాటకం. ఇదే ఫెడరల్ ఏజెన్సీలు అనేకమంది అవినీతిపరులను అధికార అందలాలెక్కించాయి, శాశ్వత స్థానం కల్పించాయి. అదే సంస్థలు వలసపాలనకు వ్యతిరేకంగా, అవినీతికి వ్యతిరేకంగా పోరాడే వారిని, పారదర్శక పాలనను డిమాండు చేసిన వారిని బెదిరిస్తున్నాయి, వేధిస్తున్నాయి. అరెస్టులు చేస్తున్నాయి".

ооо